


## ఇచ్ఛాపురపు రామచంద్రం

"ఇంక బయలుదేరుదామా?" అన్నాడతను సుజాతను చూస్తూ. ఆమె చాలా భయపడుతున్నట్లూ... యిష్టం లేనట్లూ, అప్పుడే నా అన్నట్లూ ఒక్కసారతనివంక మౌనంగా చూసింది.

అతనామె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు మృదువుగా. ఆమె అతని హృదయం మీద వాలిపోయింది.

తియ్యని క్షణాలు... ప్రేమికుల మధ్య... కొత్త దంపతుల మధ్య... "ఈ క్షణాలనిలాగే ఉండిపోనీ శాస్త్రీ" బేలగా అంది సుజాత.

"నా కోరికా అదేగా సుజా!" అతనామెను మరింతగా హృదయంలోకి తీసుకుంటున్నాడు.

అదే క్షణంలో...

రసభంగం కావిస్తూ... తలుపుమీద శబ్దం— టక్—టక్—టక్. బాధగా సుజాతనుంచి విడివడి అతను తలుపు తీశాడు. "కాఫీ కావాలా సార్?" హోటల్ బాయ్.

అతనికి చిరాకేసిందొక్కసారి. ఎంత మంచి సన్నివేశాన్ని నాశనంచేశాడు వీడు.




"వొద్దు-" అన్నాడు కసురుతున్నట్లు. బాయ్— తలుపులు చేరవేసి వెళ్ళిపోయాడు.

"ఇందుకే సుజా- యింటికోసం నేను తొందరపడుతున్నది. పేరుకే గాని- హోటలు రూముల్లో ఏకాంతమూ, రహస్యమూ లభించవు. మనలాటి - కొత్త దంపతులకి — ప్రేమికులకి— యిల్లే నయం. చిన్న యిల్లు—నువ్వూ నేనే... ఎవ్వరూ ఉండరు..."

"ఔను! పదండీ—" అంటూ మరోసారి అద్దంలో తనని చూసుకుని— శాస్త్రివేపు చూసి - కదిలింది సుజాత.

పెళ్ళయి పదిహేనురోజులేనా కాని వధూవరులు గృహాన్వేషణకు బయలుదేరారు. ఆ యిళ్లూ—తీరూ— మనుషులు చెప్పకనే చెబుతున్నారు - అవి అగ్రవర్ణపువారి వీధులని. శాస్త్రి- సంకోచించలేదు సందేహించలేదు. ఇల్లు అద్దెకు అన్న అట్టముక్క వేలాడుతున్న యింటి తలుపు కొట్టాడు. పక్కనే సుజాత.

తలుపు తెరచుకుంది. "ఎవరు మీరు?"

"ఇల్లు అద్దెకు కావాలండీ— నాకిక్కడ టీచరుగా వుద్యోగం వచ్చింది"

"మీదే వర్ణం? బ్రాహ్మలకయితేనే యిస్తాం!" కుండ బద్దలుకొట్టినట్లు అన్నది ఆ యిల్లాలు.

"నేను బ్రాహ్మడినే." విధిలేక అన్నట్లన్నాడు శాస్త్రి

"ఆమె?" ఆ యిల్లాలు నిర్మొహమాటంగా అడిగేసింది, "ఆమె బ్రాహ్మల్లా కనిపించదే!"

శాస్త్రి ముఖం చిన్నబోయింది.

సుజాతవేపు చూడటానికే భయమేసిందతనికి.

ఆ యిల్లాలికి జవాబు చెప్పకుండా—

చటుక్కున సుజాత చేయందుకుని... తొందరగా నడిపించాడు ఆ యింటికి దూరంగా. అప్పుడు- "నన్ను క్షమించు సుజా" అన్నాడు బాధగా.

ఆమె- బాధ నంతటినీ గుండెలలో దాచుకుని- "మీరేం చేయగలరు? జరిగిన దానికి మీ బాధ్యతేముందని? పదండి. మరో యిల్లు ప్రయత్నిద్దాం."

"అక్కడా — యిలాగే జరుగుతుందేమో—" భయం వెలిబుచ్చాడు అతను. ఒకసారయింది చాలు. ఇంకా సుజాత కవమానం కలిగించే పరిస్థితులలో ఎందుకు తలదూర్చాలి?

"ఫరవాలేదు. అందరూ ఒకలాగే ఉంటారా? అదృష్టం పరీక్షించుకుందాం" నవ్విందామె. తను జరిగినదానిని తేలిగ్గానే తీసుకుందన్నట్లు.

సందేహిస్తూనే— సంకోచిస్తూనే— మరో రెండిళ్ళ గడపలు తొక్కాడు శాస్త్రి యిల్లు, అద్దెకు అన్న బోర్డులున్నాయి కదా అని.

"ఆమె— మీ భార్యేనా?"

"ఊఁ"

"ఆమె బ్రహ్మలలా లేదే?"

"నేను- బ్రాహ్మణ్ణేగా?"

"అలా యివ్వం. వర్ణసంకరం మా యింటావంటా లేదు." అతని, ఆమె ముఖాలమీదే తలుపులు ధడాలున మూసుకున్నాయి.

"పిల్లు- ఎదగలేదు సుజాతా!" క్షమించమన్నట్లు చూశాడు.

"పోన్లెండి. మరోచోట."

ఆ- మరోచోటు ఎక్కడో అతనికి స్పష్టంగానే స్ఫురించింది కాని... యీ వీధుల్లో-యిళ్లు బాగుంటాయి. విశాలంగా, స్నానం గదీ... సెప్టిక్ లెట్రినూ... వంటకీ పడకకీ విడి గదులూ... సదుపాయంగా ఉంటాయి. పరిశుభ్రంగా ఉంటాయి. అంతే తప్ప- తనకేమీ తన కులంవాళ్ల మధ్యే ఉండాలన్న కోరికేమీ లేదు. ఇక్కడికయితే తన స్కూలు దగ్గర.

"కొంచెం కాఫీ తాగి వెళ్దాం సుజాతా!" అన్నాడు హోటల్ ని చూసి ఆగి. అతనికి కాళ్ల పీకు ఎక్కువనిపించడంలేదు కానీ- సుజాతకి విశ్రాంతి కావాలేమో అని.

ఆమె అతన్ని అనుసరించింది... ఫ్యామిలీ రూములోకి. అతను-మౌనంగా ఉండిపోయాడు.

"ఏమిటి శాస్త్రీ అంత దీర్ఘాలోచన?"

"ఉహుఁ. ఏమీలేదు..." అన్నాడే కాని అతను నిజంగా ఆలోచిస్తూనే ఉన్నాడు. హోటల్ రూము ఖరీదుకీ తను ఎన్నాళ్లో తట్టుకోలేడు. ఇల్లు- పోర్షను- అద్దెకి తీసుకుని- వందుకుంటే తప్ప- జీతంతో బతకలేరు తనూ సుజాతా. జరిగిన చేదు అనుభవాలు, తాము మంచి యింటికి పోచుకోలేదని స్పష్టంగా చెబుతున్నాయి. అతని మనసులోని ఆలోచన లను కనిపెట్టినట్లే అంది సుజాత.

"గూడెం గురించి నేను అబద్ధాలూ అందమయిన ఊహలూ చెప్పను కానీ- ఒక్క విషయం..."

"ఏమిటి?"

"ఇంటికి అందం తేగలదు స్త్రీ." వాగ్దానం చేస్తున్నట్లే అందామె.

"ఔను. ఇల్లు చూసి యిల్లాలిని చూడంటారందుకే," నవ్వాడతను.

"అక్కడ - కొన్ని యిబ్బందు లుండవనను. కానీ..."

"నువ్వున్న చోట నా కిబ్బందా? నెవర్."

"థాంక్యూ. అదీకాక- త్వరలో నాకూ ఉద్యోగం వొస్తుంది. అప్పుడు మనం మనకి కావలసినట్లు మంచి యిల్లు కట్టుకుందాం. అంతవరకూ..."

"ఫరవాలేదు సుజా."

వాళ్లు బయలుదేరారు... రిక్షామీద.

ఔను. గూడెం- ఊరి చివరే ఉంటుంది మరి.

శాస్త్రి మనసు తేలికగా ఉందిప్పుడు. ఎక్కడో ఒకచోట-చిన్న యిల్లూ ఒకటి రెండు గదులూ దొరక్కపోవు. తను- హరిజన స్త్రీని వివాహం చేసుకున్నాడని- బ్రాహ్మణులూ, కోమట్లూ తనని చిన్న చూపు చూసి యిల్లు అద్దెకివ్వనట్లే... సుజాత- తనకంటె ఎక్కువ కులం వాణ్ని చేసుకున్నందుకు...ఆమెను పెద్ద చూపు చూసి ఆనందంగా యిల్లిస్తారు. న్యాయంగా తాముండవలసింది గూడెం లోనే. ఎందుకంటే... బ్రాహ్మణుడయిన తను.... హరిజన్ అయిన సుజాతని చేసుకోబట్టి దానిని ఆదర్శ వివాహం అని- ప్రభుత్వం తనకి అప్పటికప్పుడే ఉద్యోగం యిచ్చింది. కొంచెం డబ్బూ యిచ్చింది,

శాస్త్రికి నవ్వొచ్చింది, మనుషుల కెందు కింత పట్టింపు కులమంటే? సుజాతని ప్రేమించేటప్పుడు తన కామె కులం తెలియదు. సహాధ్యాయి, అందమయిన అమ్మాయి. మంచి మనసు, అంతే. తీరా వివాహంవరకూ వొచ్చేసరికి, రాజకీయపు రంగులు పులిమారు. కులం రంగు పూశారు. ఆదర్శ వివాహం అన్నారు. పోనీ... ఎలా అయితేనేం... తనకి కావలసింది సుజాత. అయాచితంగా వొచ్చింది ఉద్యోగం. సుజాతకూడా పోస్ట్‌గ్రాడ్యుయేట్ కనుక- నేడో రేపో ఆమెకూ యిస్తారు. తమూ, ఆమె మరీ సుఖంగా బతకొచ్చు.

ఆ చిన్న యింటిముందుకి వొచ్చా రిద్దరూ.

"ఇది - కులపెద్ద యిల్లు. ఈయ నేమంటే అదే గూడెమంతా-" చెప్పింది సుజాత- లోపలికి తనువొక్కతే వెళ్తూ- ఆ యింట్లోకి. శాస్త్రి ఆగిపోయాడు రోడ్డు మీద... యింటి ముందర. అతను చుట్టూ కలియజూసాడు. చిన్నచిన్న యిళ్ళు. ఫరవాలేదు. ప్రస్తుతానికి సరి పెట్టుకోవచ్చు. సుజాత చెప్పింది కదా!

ఎలాటి యింటినయినా స్వర్గధామంలా తయారు చేస్తానని.

ఈ చిన్న చిన్న యిళ్ళల్లో తమ స్వర్గం ఏది కాబోతూందో.

హరిజనులకీ కట్టుబొట్లున్నాయి... అగ్రకులాలలోమల్లె కాకుండా, పెద్దలు చెబితే వినే మంచి గుణముంది.

సుజాత- పెద్దను తీసుకువొస్తుంది కొంచెం సేపటిలో.

అతను తనని చూసి అనందిస్తాడు. మెచ్చుకుంటాడు. తన దృష్టిలో కులాల అధిక్యతలూ అల్పత్వాలూ లేవు. ఎవరయినా వొకటే. కాని- అతను అలాగ భావించడు. తమవంటి తక్కువ కులం అమ్మాయిని చేసుకున్నందుకు- తనని ఎంతో మెచ్చుకుంటాడు 'మీవంటివారు మాలో కలుస్తాననడమే మాకు చాలా సంతోషం ... మీకేయిల్లు నచ్చిందో చెప్పండి, అదే మీకు ఖాళీ చేసి యిప్పిస్తాను' అంటాడు. ఉన్నవాటిలోకల్లా మంచియిల్లు ఏర్పాటు చేయిస్తాడు, ఔను! తను అగ్రకులమయ్యిందీ - వారితో సంబంధం కలుపుకుని- వారి మధ్యకు వొస్తున్నాడు కదా! అందుచేత - ఏదో వొరిగిందని పొంగిపోతాడతను.

అతన్ని చూడగానే శాస్త్రి ఆలోచనలు ఊహాలు ఆగిపోయాయి. అతని వెనుక- సుజాత.

"మీరేనా బాబూ! సుజాతని చేసుకున్నది?" నల్లగా... లావుగా ... నలభయ్యయిదూ, ఏభయ్యో ఏళ్ళ మధ్య ఉన్నాడతను.

"ఔను!" అన్నాడు శాస్త్రి.

"అమ్మాయి చెప్పింది. మీరు-యింటి కోసమని వొచ్చారటగా."

"ఊఁ."

"ఊళ్ళో ఎందుకు తీసుకోలేకపోయారు మీ బేమ్మర్ల మధ్య?"

"నేను చెడిపోయానని ... కులం చెడ్డానని... వాళ్ళెవరూ యివ్వలేదు!" అయిష్టంగానే చెప్పాడు. ఇతనికీ ప్రశ్నలన్నీ దేనికి? ఛాదస్తం... ముసిలివాడు కదా.

"ఇక్కడ యిస్తామని ఎందుకనుకున్నారు? ఎలా అనుకొన్నారు?" అతని ప్రశ్నకి - శాస్త్రి తుళ్ళిపడ్డాడు... తెల్లబోయాడు

"చెప్పండి" రెట్టించాడు.

విధిలేక- చేదుమింగుతున్నట్లు... అయిష్టంగానే అన్నాడు శాస్త్రి. "నేను సుజాతని చేసుకున్నందువల్ల నా కులం పతనమయింది. కాని, నన్ను వివాహం చేసుకోడంవల్ల సుజాత ... ఆమె కులమూ పెద్దవవుతాయి..." ఇంకెలా చెప్పాలో తెలియలేదతనికి.

"కులమంటే ఆస్తీ, అప్పూ అనుకున్నారేమిటి తమరు? మీతో సంబంధమంటే మాకేమన్నా బంగారమంటుకుంటుందా? అలా మురిసిపోయి మోసపోతామనుకున్నారా? తన కులంకాని




వాళ్ళని కలుపుకుంటే బేమ్మర్లయినా కులభ్రష్టులే. మావాళ్ళయినా కుల భ్రష్టులే. తనకంటే ఎక్కువ కులం వాళ్ళని కలుపుకున్నా కులం పోయినట్లే. తక్కువ కులంవాళ్ళని కలుపుకున్నా కులం పోయినట్లే. కులం చెడదమే.

"సుజాత మిమ్మల్ని చేసుకోకముందు మా కులమే గాని-యిప్పుడు-మిమ్మల్ని-మీ బామ్మణ్ణి చేసుకుని కులం చెడింది. కులం చెడినవాళ్ళకి గూడెంలో చోటుండదు. మీ పెద్దకులాలు మాత్రం... ప్రభుత్వం భూములిస్తుందనో—ఉద్యోగమిస్తుందనో తప్ప — మామీద అభిమానంతో మాతో కలుస్తున్నారేమిటి?" విర్రామహామాటంగా, ముఖంమీద కుండబద్దలుకొట్టినట్లు అడిగేశాడు, కడిగేశాడు.

శాస్త్రికి నోటమాట రాలేదు.

సుజాత పరిస్థితి అంతకంటే మెరుగ్గా ఏమీలేదు.

ఇది-వారిద్దరికీ- ఊహించని దెబ్బ. అనుకోని పిడుగే. అనుకున్నదీ ఆశించినదీ ఒకటయితే- జరిగినదీ, ఎదురైనదీ వేరొకటి.

శాస్త్రికి- ఒక్కసారి ఈ ప్రపంచం గురించీ.... మనుషుల గురించీ చాలా జ్ఞానోదయమౌతున్నట్లనిపించింది. పైకి ఎన్ని కబుర్లుచెప్పినా... ప్రతివాళ్ళూ... తమ కులమేదయినా—దానిని పవిత్రంగానూ, పదిలంగానూ... ప్రాణ సమానంగానూ ఉంచుకోవాలనే ప్రయత్నిస్తారన్నమాట ఈ దేశంలో. పాలలో నీరు కలసినా, నీటిలో పాలు కలసినా కల్తీ కల్తీయే అని వాళ్ళ భావం. అందుచేతనే తమకి- అక్కడా స్థానం లేకపోయింది, ఇక్కడా లేకపోయింది. ఈ మనుషులు కులమనే కుహనా భావాన్ని మించి ఎప్పటి కెదుగుతారు?

"పదండి" అంది సుజాత.

అతను నీరసంగా, నిరాశగా... నిస్పృహగా... అడుగు ముందుకు పడనట్లు!

"శాస్త్రీ! ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"అహ... ఏమీలేదు. మనది... నీదీ, నాదీ— ఏ కులమా అని."

"మరీ అలా డీలా పడిపోకు. మన కొక గూడు దొరక్కపోదు. అంతవరకు అవసరమయితే...చెట్టుకిందైనా ఉందాం. చెట్లకు కులముండదు." రెంటికీ చెడిన రేవడిలా ఉన్న ఆ పరిస్థితిలోకూడా సుజాత ఏం చూసుకుని అలా ధైర్యంగా ఉండగలుగుతూందో, మాట్లాడగలుగుతూందో అతనికి అంతుపట్టడం లేదు. అతనామె చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

అతని మనసూ దానిలోని అధైర్యాన్ని ఆ స్పర్శద్వారా అర్థం చేసుకున్నట్లూ ... ధైర్యం చెబుతున్నట్లూ... "మనది మానవ జాతి. మనకు ఒం- ప్రేమ కులం. ఈ ప్రేమ కులమూ త్వరలో చాలా అభివృద్ధి చెందుతుంది. అప్పుడు ఇటువంటి సమస్యలుండనే ఉండవు. ఆ రోజు దగ్గరలోనే ఉంది!" అంది సుజాత.

ఈసారి శాస్త్రి సుజాతతో సమంగా... నిర్భయంగానూ, ధైర్యంగానూ అడుగులు వేయసాగాడు ముందుకి.

(కథాకథన సౌలభ్యంకోసం విధిలేక కులాల పేర్లు చెప్పవలసి వొచ్చింది. రచయిత క్షంతవ్యుడు.)

